క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి రాక

మహాముత్తారం: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు ఆదివారం మహాముత్తారానికి పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌తోపాటు బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధు రానున్నట్లు మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బోర్లగూడెం గ్రామంలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలనుంచి కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మండల సభ వాయిదా

చిట్యాల: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీపీ దావు వినోద తెలిపారు. మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ముగ్గురు మాత్రమే వచ్చారని దీంతో సభను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ జయశ్రీ, జెడ్పీటీసీ గొర్రె సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన నిమ్మల మల్లయ్య మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లు విరిగాయి. దీంతో అతను మంచానికే పరిమితమయ్యాడు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న రిటైర్డ్ డీఈ బండారి భద్రయ్య రెండు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాడు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు సూదనబోయిన విష్ణు యాదవ్, నేత ప్రవీణ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలోని ఎంపీపీఎస్ స్కూల్ ఆవరణంలో శనివారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో యువకులు 11 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్, జనగం ప్రభాకర్, అభినయ్, పవన్, సంతోష్, అనిల్, ప్రశాంత్ ఉన్నారు.

యువకుడి మృతి



రాజు(ఫైల్)

రేగొండ: కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి చెందిన సంఘటన రేగొండ మండలంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం పులుకుర్తి గ్రామానికి చెందిన ఈదునూరి రాజు(33) 12 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. కాగా భార్యతో ఐదు సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మద్యానికి బానిసైన రాజు మద్యం మత్తులో అతడి అమ్మమ్మ గ్రామమైన కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లికి శుక్రవారం వచ్చాడు. మద్యం మత్తులో ఉన్న రాజును మేనమామ సోమేల్ మందలించగా శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో చెన్నాపూర్ శివారులోని పెట్రోల్ బంక్ ముందు మద్యం మత్తులో అక్కడే పడుకోని చనిపోయాడు. మృతుడి తండ్రి ఈదునూరి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై శ్రీలత తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



కాటారం: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన సంఘటన కాటారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన దుగ్యాల రాజయ్య(46) కొంత కాలంగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. మద్యం మానేయాలని ప్రశ్నించిన భార్య చిలకమ్మను తరుచూ కొట్టడంతో పాటు అనుమానిస్తూ వేధింపులకు గురిచేస్తుండే వాడని తెలిపారు. ఇదే క్రమంలో ఈ నెల 26 మధ్యాహ్నం రాజయ్య మద్యం తాగి వచ్చి ప్రశ్నించిన భార్యను చంపుతానని బెదిరించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న రాజయ్య అదే రోజు సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు భార్యకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాజయ్య శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య చిలుకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మ్యాక అభినవ్ తెలిపారు.

పనుల్లో జాప్యం చేయొద్దు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: అధికారులు గ్రామాల్లో ఉన్న పనులపై జాప్యం చేయొద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే మండలంలోని చల్లగరిగ–కొడవటంచ గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు మంజూరు చేయించి మూడు నెలలు కావస్తున్న పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం పద్ధతి కాదన్నారు. వెంటనే అధికారులు పనులను చేపట్టాలని కోరారు. అలాగే మండల కేంద్రంలో మండల సభ నిర్వహించగా ఇరిగేషన్ అధికారులు సమావేశానికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి మండల సభకు మండల అధికారులు తప్పకుండా హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశానికి రానివారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయశ్రీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోద, జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీడీఓ జయశ్రీ, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఖాజామోహియుద్దీన్, ఏఈ తిరుపతి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అనిల్‌కుమార్, మిషన్ భగీరథ ఏఈ రంజీత్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏంపీఓ రామకృష్ణ, ఎపీఓ హలీం పాషా, రాజ్‌మహ్మద్‌తో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మండల కేంద్రంలో సీనియర్ జర్నలిస్టులు రాంరెడ్డి, మాసు రాజయ్య జ్ఞాపకార్థం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతులమీదుగా శనివారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జర్నలిస్టులు సేవాభావ కార్యక్రమాలు చేయడం, ప్రజలకు వేసవి కాలంలో దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఐత ప్రకాశ్‌రెడ్డి, టేకుమట్ల జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, పాల్గొన్నారు.

కావ్య గెలుపు కోసం కృషి చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని జూకల్ ఓ ఫంక్షన్ హాల్లో మూడు మండలాలకు(చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి) చెందిన ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 30న రేగొండ మండలంలో జరిగే జనజాతర సభకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అత్యధికంగా తరలిరావాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎంపీటీసీ గుర్రపు సునీత, మాజీ వార్డు సభ్యులు గుర్రం కోమల, గుర్రపు తిరుపతిగౌడ్, నాయకులు బుర్ర రాములు, ఉయ్యాల రమేష్ , బుర్ర కృష్ణ, శ్రీనివాస్, ఏలేటి రామయ్యపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఏలేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మధుసూదన్

రేగొండ: ప్రజలు వడదెబ్బ తగలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతేనే బయటకు వెళ్లాలని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మాత్తుగా సందర్శించి మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పనులు ఉదయం 11 గంటలలోపు ముగించుకోవాలన్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీల కోసం పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకేట్లను పంపిణీ చేయాలని ఆశావర్కర్లకు సూచించారు. వృద్ధులు, గర్భిణులు మధ్యాహ్నం వేళలో బయటకు రావద్దని సూచించారు. ఒకవేళ వడదెబ్బకు గురైన వ్యక్తులను చల్లటి ప్రదేశంలో ఉంచి తడి గుడ్డతో తుడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి హిమబిందు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కష్టాలు



మాట్లాడుతున్న ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి కవిత

వెంకటాపురం(కె): కాంగ్రెస్ ప్రభుత్వంతో రైతులకు కష్టాలు మొదలైయ్యాయాని ఎంపీ, మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వత రైతులకు రైతు బంధు ఇవ్వటం లేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో రైతులకు రైతు బంధు ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలు ఇస్తుందని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఓటు వేయించుకున్నారని నేటికి అవి అమలు చేయటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణబాబు, రావుల పల్లి రాంప్రసాద్, గోవింద నాయక్, గంపా రాంబాబు, గుడవర్తి నర్సింహమూర్తి, ముడుంబా శ్రీనివాస్, అట్టం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వెంకటాపురం(ఎం): చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సఖి అడ్మినిస్ట్రేటర్ లావణ్య అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మీదేవిపేట, లక్ష్మీపురం, నర్సింగాపురం గ్రామాలలో సఖి అడ్మినిస్ట్రేటర్ లావణ్య, కౌన్సిలర్ కల్పన, పారా మెడికల్ స్టాఫ్ రాధ, మౌనికలు మూడు బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లోని ఉపాధిహామీ కూలీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. సఖీ కేంద్రం ఐదు రకాల సేవలందిస్తుందన్నారు. న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, బాల్య వివాహాల నిర్మూలన, మహిళల గృహహింస చట్టాలపై ఉచిత సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ హబ్ స్రవంతి, హెల్ప్‌లైన్ వర్కర్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న వెంకటరమణ

మల్హర్: బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల ప్రచార కమిటీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రం తాడిచర్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్‌కు పథకాలు గుర్తుకు వస్తాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దనెక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో పది సంవత్సరాలల్లో అద్భుతమైన పథకాలతో ప్రతి పల్లెను కేసీఆర్ అభివృద్ధి పథంలోకి తీసుక వచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు అధికారం అప్పగించి గోసపడుతున్నామని మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నష్టపోతామన్నారు. వారసత్వ రాజకీయాలకు ఓటమితో సమాధానం చెప్పి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అనంతరం తాడిచర్ల, చిన్నతూండ్ల గ్రామాల్లో ఎన్నిల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావు, మండల యూత్ అధ్యక్షుడు జాగరీ హరీష్, తాడిచర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు అన్నమనేని మధుసూదన్, తాజోద్దిన్, యాదగిరిరావు, రాజేశ్వర్‌రావు, రవి, ఓదేలు, రాజేశ్వర్‌రావు, సాంబయ్య, మల్లేష్, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే దిక్సూచి

గోవిందరావుపేట: తెలంగాణకు కేసీఆర్ పాలనే దిక్సూచి అని బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ లకావత్ నరసింహనాయక్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రస్థానంలో ఎన్నో కష్ట, నష్టాల మధ్య త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. కేసీఆర్ అధికారంలోకి రాగానే రైతు రాజ్యం స్థాపనకు అడుగులు పడ్డాయన్నారు. లోకసభ ఎన్నికల్లో మహబుబాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించి కేసీఆర్‌కు కానుక ఇవ్వాలని అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్‌డే వేడుకలు



పలకలు పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్

మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం స్కూల్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పాల్గొని చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల దినోత్సవం నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: గ్రామాల్లో దళితుల స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రతి నెల 30న మానవ హక్కుల దినోత్సవం నిర్వహించాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ హక్కుల దినోత్సవంతో పాటు దళితులను చైతన్య వంతులను చేయడానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల భద్రయ్య, అంబేడ్కర్ యువజన సంఘం మండల నాయకులు కట్కూరి ఐలయ్య, మొగుళ్లపల్లి గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బండారి కుమార్, ప్రధాన కార్యదర్శి బండారి అశోక్, కోశాధికారి కుమార్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దకుంటపల్లి తండాలో గుడుంబా స్థావాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకుంటపల్లిలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఇద్దరు వ్యక్తుల నుంచి 30 లీటర్ల గుడుంబా, 50 కేజీల చెక్కరతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే 3500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో భూపాలపల్లి సీఐలు రమ్య, రాజసమ్మయ్య, ఎస్సై రబ్బాని, సిబ్బంది రఘుపతి, విష్ణు, కృష్ణ, శ్రీకాంత్, వెంకన్న పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



భూపాలపల్లి అర్బన్: పతాకావిష్కరణ చేస్తున్న గండ్ర జ్యోతి



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నేడు(ఆదివారం) హనుమకొండలో నిర్వహించే కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యాలయాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఆవరణలో గులాబీ జెండా ఎగురవేసి, కార్యకర్తలకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మే 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో డా.సుధీర్ కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. 2001లో పార్టీ స్థాపించినప్పటి నుంచి కేసీఆర్ బాటలో నడుస్తూ, తెలంగాణ సాధనలో ఉద్యమించిన వ్యక్తి సుధీర్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు, జెడ్పీటీసీ సభ్యుడు జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ మాజీ చైర్మన్ కొడారి రమేష్‌యాదవ్, వెంకట్‌రావు, నాయకులు చదువు అన్నారెడ్డి, బెల్లంకొండ శ్యాంసుందర్‌రెడ్డి, గాలి చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

మొగుళ్లపల్లి: రేగొండలో ఈనెల 30న నిర్వహించే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, యార సంజీవరెడ్డి, క్యాతరాజు రమేష్, దండ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎర్రబెల్లి పున్నం చందర్‌రావు, పోలినేని రాజేశ్వరరావు, మోటె ధర్మారావు, యార సంజీవరెడ్డి, మండ రవి, మంద స్వామి, గుండారపు తిరుపతి, గజ్జి రాజుకుమార్, రొంటాల సంపత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్రాభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

భూపాలపల్లి రూరల్: బీజేపీతోనే దేశంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెన్నంపల్లి పాపయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం భూపాలపల్లి పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి రావడానికి ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టి విజయాన్ని ఇవ్వబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కంబాల రాజయ్య, ఓదెలు, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లో మంటలు



పిటి బాక్స్ నుంచి వస్తున్న మంటలు

కాటారం: మండల కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం ఎండ వేడికి ప్రొటెక్షన్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మంటలు చెలరేగాయి. సబ్‌స్టేషన్‌పైన అమర్చిన ప్రొటెక్షన్ ట్రాన్స్‌ఫార్మర్ బాక్స్‌లో అకస్మాత్తుగా మంటలు రావడంతో గమనించిన ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో కొంత సమయం పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు వెంటనే మంటలు ఆర్పి మరమ్మతులు చర్యలు చేపట్టి విద్యుత్ పునరుద్ధరించారు. ట్రాన్స్‌కో సిబ్బంది సమయానికి గమనించడంతో పెను ప్రమాదం తప్పింది.